www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 6 జనవరి 2025



పరిశ్రమల్లో ఆగని ప్రమాదాలు..

- ఫార్మసూటికల్ ఫ్యాక్టరీలో గ్యాస్ లీక్
- 20 మందికి గాయాలు?

ప్రజాశక్తి- నారాయణవనం: పరిశ్రమల్లో నిబంధనలు పాటించని కారణంగా ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. మూడు రోజుల క్రితం ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమల్లో జరిగిన అగ్ని ప్రమాద సంఘటన మరువక ముందే నారాయణవనం మండలంలోని ఫార్మా సూటికల్ ఫ్యాక్టరీలో గ్యాస్ లీకై కార్మికులు గాయపడినట్లు సమాచారం. పరిశ్రమల యజమానులు సరైన నిబంధనలు పాటించపోవడం వల్లే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నారాయణవనం మండలంలో ఫార్మా సూటికల్స్ పరిశ్రమ లో శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో గ్యాస్ లీకై 20 మంది అస్వస్థతకు గురైనట్టు తెలిసింది. అందులో 10 మందిని వేపగుంట క్రాస్ వద్ద అన్నా గౌరీ ఆస్పత్రిలో చేర్పించి నట్లు సమాచారం.. ఓ కార్మికుని అజాగ్రత్తతో గ్యాస్ లీకైన ఘటనపై ఫ్యాక్టరీ సిబ్బంది సమాచారం ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. ట్రైన్డ్, సీల్డ్ ఆపరేటర్లు లేకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఈ ఫ్యాక్టరీ మేనేజర్‌కు, హెచ్ ఆర్‌కు ఫోన్ చేయగా అందుబాటులో లేదనే సమాచారం వస్తోంది. ఫ్యాక్టరీ వద్ద పరిస్థితిని తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్ బృందం గౌరీ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించడానికి వెళ్లింది. కానీ అక్కడ కంపెనీ మేనేజర్ వాళ్లని చూడడానికి నిరాకరించారు. చాలా గోప్యంగా అక్కడ జరిగిన విషయాన్ని బయటకు పొక్కనీయకుండా జాగ్రత్తలు తీసు కున్నారు. చికిత్స పొందుతున్న వారికి తక్షణమే న్యాయం జరిగేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కోరారు.

చికిత్స పొందుతున్న కార్మికుడు

సంక్రాంతికి చంద్రన్న కానుక అందేనా?

- 2014లో టిడిపి సర్కారు పంపిణీ
- పండుగ సమీపిస్తున్నా కానరాని ప్రకటన
- ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సంక్రాంతి కానుక కోసం ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు ఎదురుచూస్తున్నారు. పండగ వచ్చే వారం నుంచి మొదలు కావడంతో కూటమి ప్రభుత్వం కానుక రేషన్ షాప్ ద్వారా ఇస్తుందా? లేదా అని వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఇంతవరకు ఎలాంటి ప్రకటన రాలేదు.

2014లో టిడిపి సర్కారు పంపిణీ

2014లో టిడిపి ప్రభుత్వం అమలు చేసిన 'చంద్రన్న సంక్రాంతి కానుక'ను గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా ఎత్తి వేసింది. టిడిపి పాలనలో పండుగల వేళ కొన్ని సరుకులను లబ్ధిదారులకు అందించేవారు. క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. వైసిపి ప్రభుత్వం వాటిని పక్కన పెట్టి కేవలం బియ్యం, పంచదార, కందిపప్పు మాత్రమే పంపిణీ చేసింది. చంద్రబాబు సారధ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇప్పుడు కానుకల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సంక్రాంతికి చంద్రన్న కానుకను అందజేస్తారా? లేదా? అనే ప్రశ్నలు సర్వతా వ్యక్తం అవుతున్నాయి. క్రిస్మస్ కానుకను మరిచిపోయిన కూటమి ప్రభుత్వం సంక్రాంతి కానుకనైనా ఇవ్వాలని పలువులు లబ్ధిదారులు కోరుతున్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం 2019 వరకు పండుగల వేళ కానుకలు అందించింది. అప్పట్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 11లక్షల 50 వేల 758 రేషన్ కార్డులుండగా 30 శాతం మందికి రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలను అందించారు. మిగిలిన సుమారు 11 లక్షల 55 వేల మందికి సంక్రాంతి కానుకలను అందించారు. జిల్లా వ్యాప్తంగా రెండూ కలిపి 825 టన్నుల 279 కేజీల కందిపప్పు, 11లక్షల 49 వేల 681 కేజీల పామాయిల్, 11లక్షల 50 వేల 758 కేజీల గోధుమపిండి, 825 టన్నుల 280 కేజీల శనగపప్పు, 824 టన్నుల 923 కేజీల బెల్లం, 11లక్షల 49 వేల 710 (100 గ్రాములు) నెయ్యి ప్యాకెట్లును అందించారు. ఒక్కో కార్డు దారునికి రూ.207.94 పైసలు విలువ చేసే కేజి గోధుమ పిండి, అర కిలో చొప్పున బెల్లం, పామాయిల్, శనగ పప్పు, కందిపప్పు, 100 గ్రాముల నెయ్యి, ఒక సంచిలో అందించారు.

ఈ సంక్రాంతికి అనుమానమే.!

ఈ సంక్రాంతికి ప్రత్యేక కానుకలు లేనట్లేనని తెలుస్తోంది. ఎందుకంటే ప్రభుత్వం ఇప్పటి వరకు దీనిపై ఎటువంటి ప్రకటన చేయలేదు. చంద్రబాబు సర్కారులో ఏటా ఈ పథకం కోసం రాష్ట్ర వ్యాప్తంగా రూ.287 కోట్లు ఖర్చు చేసేవారు. కార్డుదారులకు ఆరు రకాల సరుకులు ఉచితంగా పంపిణీ చేసేవారు. అయితే ఈ ఏడాది సంక్రాంతి సమీపిస్తున్నా ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఒకవేళ ఇవ్వాలని అనుకుంటే జనవరి 1వ తేదీ నుంచే పంపిణీ చేయాల్సి ఉంది. దీని గురించి కానీ జిల్లాలో అటువంటి పరిస్థితి ఏమీ కనిపించడం లేదు. ఏడు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం గత ఐదేళ్లకు ముందు అమలు చేసిన అనేక పథకాలను పునరుద్ధరిస్తామని చెప్పింది. చివరకు క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ కానుకలను కూడా అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే ఆచరణలో మాత్రం కానుకల సంగతిని: కూటమి పాలకులు మర్చిపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రజలు ఎంతో ఆదరించిన చంద్రన్న సంక్రాంతి కానుకలు మళ్లీ ఇస్తారని లబ్ధిదారులు ఆశిస్తున్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం

దీనిపై ఎటువంటి ఆసక్తి చూపకపోతుండడంపై సంక్రాంతి కానుక పథకం అమలయ్యే అవకాశాలు దాదాపుగా కనిపించడం లేదు. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిపోవడంతో నెలనెలా పింఛన్లు, జీతాలకే గగ్గోలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో పలు సంక్షేమ పథకాలకు ప్రభుత్వం దూరంగా ఉండటం గమనార్హం.

ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్ట్

దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి తిరుపతి జిల్లా రేణిగుంట మండలం మామండూరు అటవీ ప్రాంతంలో ఎర్రచందనం చెట్లను నరికి, వాటిని దుంగలుగా మలుస్తున్న ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్సు పోలీసులు తెలిపారు. వీరి నుంచి మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని, పారిపోయిన వారికోసం గాలింపు చర్యలు చేపట్టామని టాస్క్ ఫోర్స్ అధి కారులు స్పష్టం చేశారు. టాస్క్ ఫోర్స్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఎస్ఎస్ సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ విశ్వనాథ్ బృందం శనివారం సాయంత్రం నుండి రేణిగుంట సమీపంలో ఉన్న మామండూరు అటవీ ప్రాంతంలో స్థానిక అటవీ సిబ్బందితో కలిసి కూంబింగ్ చేపట్టామన్నారు. తిరుపతి ఫారెస్ట్ డివిజన్ మామండూరు నార్త్ ఫారెస్ట్ బీట్‌లోని గోకుడు బండలు సమీపంలో చెట్లను నరుకుతున్న శబ్దాలు వినిపించడంతో, అటుగా వెళ్లేసరికి కొంతమంది ఎర్రచందనం చెట్లను నరికి వాటిని దుంగలుగా మలుస్తున్నారన్నారు. వారికి సమీపించి లొంగిపోవాలని హెచ్చరించడంతో వారు పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. పారిపోతున్న వారిని వెంబడించి ఇద్దరు స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నామని అధికారులు తెలిపారు. పట్టుబడ్డ ఇద్దరు స్మగ్లర్లు తమిళనాడుకు చెందిన వారుగా గుర్తించామన్నారు. ఈ ఘటనపై తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రఫీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి, తిరుచానూరు సెక్షన్ పాడి పేట 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి పానకం ఫిడర్ మరమ్మతులు, 132 కెవిలైన్లు రేణిగుంట నుండి 132 కెవి తిరుపతి వరకు ట్రాన్స్ కో లైన్లు మరమ్మతులు కారణంగా నేడు 6వ తేదీ సోమవారం ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తిరుపతి డివిజన్ ఆపరేషన్ ఈఈ చంద్రశేఖర రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గంగనగుంట, ఎంఎం కండ్రిగ , వేమూరు, పానకం హరిజనవాడ, తదితర పరిసర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు రెవెన్యూ , రీసర్వే అంశాలపై వర్క్ షాప్: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఈనెల 7వ తేదీన మంగళవారం సీసీఎల్ఏ మంగళగిరి కార్యాలయంలో ఆర్‌డీవోలకు, సబ్ కలెక్టర్‌లకు, రెవెన్యూ, రీ సర్వే అంశాలపై వర్క్ షాప్ నిర్వహించనున్న నేపథ్యంలో తిరుపతి జిల్లాలోని తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు, గూడూరు సబ్ కలెక్టర్ సీసీఎల్ఎ వర్క్ షాప్‌నకు హాజరు కానున్నారని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు

'వంద పడకల ఈఎస్ఐ ఆస్పత్రి ప్రయోజనకరం: సిఐటియు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ఎన్నో ఏళ్లుగా ఈఎస్ఐ ఆస్పత్రి సామర్థ్యాన్ని పెంచాలని, వంద పడకల ఆస్పత్రిగా మార్చాలని కార్మిక సంఘాలు పోరాడుతున్న విషయం విదితమేనని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏడున్నర కోట్ల రూపాయల నిధుల కేటాయింపుతో ఈఎస్ఐ ఆస్పత్రిని వంద పడకలుగా మార్చడం ఎంతో ప్రయోజనకరమని ఇందుకు కృషి చేసిన వారికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఆదివారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. వంద పడకల ఆస్పత్రిగా మార్చేందుకు తిరుపతి ఎంపీ గురుమూర్తి కృషి అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా కోటి రూపాయలతో పాటు, మంత్రి వర్గం అనుమతి ఇవ్వడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రి రాయలసీమ, నెల్లూరు ప్రాంత కార్మిక వర్గానికి ఎంతో తోడ్పడుతుందని గుర్తు చేశారు. ఆస్పత్రిలో సిబ్బంది, డాక్టర్ల సంఖ్యను పెంచాలని కోరారు. వంద పడకల సామర్థ్యంతో పాటు, నూతనంగా డాక్టర్లను, సిబ్బందిని నియమించడం ద్వారా ఈ ఆస్పత్రి అత్యంత నాణ్యమైన వైద్యానికి కేంద్రంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. వంద పడకల ఆస్పత్రి ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా కార్యాచరణను నిర్ణయించి సిబ్బందిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. స్వల్ప సమస్యలు పెండింగ్ లో ఉన్న నేపథ్యంలో వాటి పరిష్కారానికి ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి మరింత శ్రద్ధ వహించి ఈ ఆసుపత్రి పటిష్టతకు తగిన చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని విషయాలకు ప్రభుత్వం సహకరించాలని ఆయన కోరారు.

ఎడ్విన్ జర్నల్ ఎటోరియల్ మెంబర్‌గా ఆచార్య దేవప్రసాదరాజు

- ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్‌కు ఉన్నత అవకాశం

ప్రజాశక్తి - క్యాంపస్ : సైన్స్ రంగంలో ప్రఖ్యాత జర్నల్ ఎడ్విన్ ఎడిటోరియల్ మెంబరుగా ఎస్ వి యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగ ఆచార్య బి.దేవప్రసాద్ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు జర్నల్ ఇండియన్ ప్రతినిధి ఒబిరియన్ తెలిపారు. ఎస్వీయూ ఫిజిక్స్ విభాగం ఆచార్య దేవప్రసాద రాజు బోధన, పరిశోధన, విస్తరణ, పాలనా రంగాల్లో విశేష కృషి చేశారు. ఎలక్ట్రాన్ ప్యారా మాగ్నెటిక్ ప్రత్యేక అంశంపై పరిశోధనలు చేశారు. ఈ క్రమంలో వీరు రూపొందించిన 110 పరిశోధన వ్యాసాలు ప్రముఖ జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి. ఒక పుస్తకం, మూడు బుక్ చాప్టర్స్, నాలుగు పరిశోధనా ప్రాజెక్టులు, వివిధ సదస్సులు, వర్క్ షాప్ లు నిర్వహించారు. వర్సిటీ అడ్మిషన్స్ విభాగ జాయింట్ డైరెక్టర్ గా , హాస్టల్ వార్డెన్ గా, రీసెట్ కన్వీనర్ గా, ఫిజిక్స్ విభాగాధిపతిగా పనిచేశారు. ఇప్పటికే అప్లైడ్ సైన్స్ , మెటీరియల్ సైన్స్, నానో సైన్స్, కరెంట్ రీసెర్చ్ ఇన్ ఫిజిక్స్ వంటి జర్నల్స్ కు అసోసియేట్ ఎడిటర్ గా పనిచేస్తున్నారు. తొమ్మిది సైన్స్ జర్నల్ కు సమీక్షకుడిగానూ ఉన్నారు. ఐదు ప్రముఖ సైన్స్ రంగ సంస్థల్లో సభ్యులుగానూ ఉన్నారు. వీరి పర్యవేక్షణలో 12 పీహెచ్డీలు, 2 ఎంఫిల్ డిగ్రీలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో ఎడ్విన్ జర్నల్ ఎటోరియల్ మెంబర్ గా నియమితులైన ఆచార్య దేవప్రసాదరాజును పలువురు అభినందించారు.

కదలని మురుగు..

- డ్రైనేజీలు అస్తవ్యస్తం వణికిస్తున్న
- విష జ్వరాల భయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

పట్టణంలోని స్థానిక మున్సిపాల్టీ పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. మురుగునీరు కదలకపోవడంతో దోమలు అధికమై విష జ్వరాల వ్యాపిస్తాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పుత్తూరు మున్సిపాల్టీ రెండవ వార్డులోని తిమ్మాపురంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారాయి. మురుగునీరు ముందుకు సాగడంలేదు. ఈ సమస్యను గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పరిష్కారం కాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయం గురించి సంబంధిత అధికారులను ప్రశ్నిస్తే కలెక్టరుకు తెలిపామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారే తప్ప సమస్య పరిష్కారం కాలేదని స్థానికులు వాపోతున్నారు. కనీసం భోగి పండగ పూట తిమ్మాపురం గ్రామ ప్రజల అవస్థలు చూస్తుంటే వీధుల్లో ముగ్గులు కూడా వేసుకునే పరిస్థితి లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దుర్గంధం వల్ల చాలామంది జ్వరాలతో అవస్థపడు తున్నారని స్థానికులు తెలిపారు. ఈ విషయంపై స్పందించి పుత్తూరు మున్సిపాలిటీ అధికారులు తిమ్మాపురం ప్రజలను డ్రైనేజీ సమస్య నుండి కాపాడాలని స్థానికులు కోరారు.

భూ ఆక్రమణకు యత్నం

మిట్టగాంధీపురం వద్ద అడ్డుకున్న వైనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

మంగళం పరిధి న్యూ మంగళం పంచాయతీ బిట్ట గాంధీపురం వద్ద ఆదివారం కొంతరు వ్యక్తులు 18 ఏళ్ల క్రితం ఇచ్చిన పట్టాలు అని చెబుతూ భూ ఆక్రమణకు యత్నించారు. దీనిపై స్థానికంగా ఉన్న టిడిపి నాయకులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో రెవెన్యూ అధికారులు ఆ నిర్మాణాలను అడ్డుకున్నట్లు సమాచారం. కాగా మంగళం గ్రామ రెవెన్యూ లెక్క దాఖల సర్వే నెంబర్ 76లో రెండు ఎకరాల 33 సెంట్లు భూమి వుంది. ఇందులో 60 సెంట్లకు సంబంధించి రాష్ట్ర హైకోర్టులో వ్యాజ్యం నడిచి తీర్పు ఉత్తర్వులు వెలువడ్డాయని, అమలకు సమయం పడుతుందని కేసు వేసిన కార్తీక్ తెలిపారు. 60 సెంట్లు మినహా ఉన్న భూమి బాట పోరంబోకు భూమిగా రికార్డుల్లో ఉందన్నారు. ఈ మిగులు భూమికి సంబంధించి ఎలాంటి పట్టాలు మంజూరు చేయలేదని కలెక్టర్ ఎండార్స్మెంట్ ఇచ్చి ఉన్నారన్నారు. ఈ దొంగ పట్టాలను చేతబట్టి భూ అక్రమణకు యత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమణ స్థలంలో గది నిర్మాణం చేపట్టిన దృశ్యం

స్థానికులకు శ్రీవారి దర్శనం టోకెన్లు జారీ

ప్రజాశక్తి -తిరుమల: ప్రతి నెలా మొదటి మంగళవారం స్థానికులకు కల్పించే దర్శనంలో భాగంగా ఆదివారం స్థానిక దర్శన కోటా టోకెన్లను టీటీడీ జారీ చేసింది.ఈ మేరకు తిరుపతి మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలోను, తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్లో శ్రీవారి దర్శన టోకెన్లు జారీ చేశారు.

రైతు నేత 'దల్లేవాల్ ప్రాణాలు కాపాడండి': సిఐటియు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: ప్రముఖ రైతు నాయకుడు, జగ్బీర్ సింగ్ దల్లేవాల్ పంజాబ్‌లోని కనౌరి సరిహద్దుల్లో 40 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారని, ఆయన ప్రాణాలను కాపాడాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరుతూ, నవంబర్ 26వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టిన దల్లేవాల్ ఆరోగ్యం పూర్తిగా క్షీణిస్తోందని తెలిపారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆయన విమర్శించారు. పంజాబ్ ప్రభుత్వం తమ ఆసక్తిని తెలిపి కేంద్ర ప్రభుత్వాన్ని చర్చలకు ఆహ్వానించాలని విజ్ఞప్తి చేసినా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పట్టించుకోకపోగా కనీస స్పందన వ్యక్తం చేయకపోవడం అన్యాయమన్నారు. వృద్ధాప్యంలో ఉన్న దల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, రైతాంగం పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతోందని, దేశ వ్యాప్తంగా ఆయనకు మద్దతు వెల్లువలా వస్తుందన్న విషయాన్ని గమనించకుండా 'మమ్మల్ని ప్రశ్నిస్తారా?' అనే దురహంకారంతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అత్యంత అమానుషంగా ప్రవర్తించడం అన్యాయమన్నారు. మోడీ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, తక్షణం రైతు నాయకుల బృందాన్ని చర్చలకు ఆహ్వానించాలని, రైతు సమస్యలపై సానుకూలంగా స్పందించాలని దల్లేవాల్ ప్రాణాలు కాపాడాలని ఆయన కోరారు.

రేపు శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జనవరి 10 నుండి 19వ తేదీ వరకు పది రోజుల వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలను పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీ మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమం నిర్వహిస్తారు. జనవరి 7వ ఉదయం 6 నుండి 10 గంటల వరకు ఈ ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఆనంద నిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా కడుగుతారు. ఈ సమయంలో స్వామి వారి మూల విరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పుతారు. శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం స్వామి వారి మూల విరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజలు, నైవేద్యం కార్యక్రమాలు అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. 7వ తేది కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతో 6వ తేది సిఫార్సు లేఖలు స్వీకరించరు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సహకరించాలని టీటీడీ భక్తులకు విజ్ఞప్తి చేసింది.

గుడిమల్లం ఆలయాభివృద్ధికి పరిశీలన

ప్రజాశక్తి- ఏర్పేడు: ఏర్పేడు మండలంలోని గుడిమల్లం ఆలయంలో అభివృద్ధి పనుల నిమిత్తం ఆదివారం సెంట్రల్ ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ ఆలయాన్ని పరిశీలించింది. సెంట్రల్ ఆర్కియాలజీ డిపార్టుమెంట్, సౌత్ ఆర్డి, సెంట్రల్ ఆర్కియాలజీ డిపార్టుమెంటు ఏపీ సూపరింటెండెంటు డి ఈ, ఏఈ , చంద్రగిరి ఆర్కియాలజీ డిపార్ట్మెంట్ సర్కిల్, సిఐలు ఆలయంలో అభివృద్ధి పనుల నిమిత్తం పరిశీలించడానికి విచ్చేశారు. ఆలయ మాజీ చైర్మన్ బత్తలగిరి నాయుడు, ఆలయ అర్చకులు, కార్యనిర్వాహణాధికారి సాదర స్వాగతం పలికి స్వామి వారి దర్శనం ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా సౌత్ జోన్ ఆర్డి ఎన్ కె పతాక్, సెంటర్ ఆర్కియాలజీ డిపార్టుమెంట్ సూపరింటెండెంటు గోపీనాథ్ ఈ ఆలయంలో అభివృద్ధి పనుల నిమిత్తం డిఈ, ఏఈకి తగిన ప్లాన్లను, ఎస్టిమేషన్లు తయారు చేసి పంపాలని కోరారు.

పట్టుకో.. దమ్ముంటే పట్టుకోండి..!

- పాత వేపకుప్పంలో రంకేసిన కోడె గిత్తలు
- ఉత్సాహంతో ఉరకలేసిన యువకులు
- వైభవంగా పరుష పందేలు

ప్రజాశక్తి -రామచంద్రపురం: 'పట్టుకో.. పట్టుకో.. దమ్ముంటే నా కోడె గిత్తలను పట్టుకోండి' అంటూ యజవ ానులు పశువులను వదలడంతో రంకెలేసి పరిగె త్తాయి. ఆదివారం రామచంద్రాపురం మండలంలో పాత వేపకుప్పంలో కోడి గిత్తలు రంకె లేశాయి..యువకుల జోరుతో జల్లికట్టు జోరుగా సాగింది. రామచంద్రపురం మండలం, పాత వేపకుప్పం గ్రామంలో సంక్రాంతికి ఎనిమిది రోజులు ముందే పరుష పందేలు ప్రారంభమయ్యాయి. గ్రామంలో రైతు కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటున్న కోడెగిత్తలు ఆవులను రైతులు వాటి కొమ్ములకు రంగులు వేసి వాటిని శుభ్రంగా కడిగి పూజించారు. కోడెగిత్తల కొమ్ములకు చెక్క పలకలు, నూతన వస్త్రాలు, వేలాది రూపాయల పారితోషికంగా నగదును కట్టి 'నా కోడి గిత్తల పౌరషం చూడండి...' అంటూ వాటి యజమానులు 'మీ వల్ల అయితే పట్టుకోండి చూద్దాం..' అంటూ నగదు విలువైన పలకలు, దుస్తులను కొమ్ములకు కట్టి దొడ్లో నుంచి బరిలోకి దించారు. అప్పటికే వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యువత గుంపులు గుంపులుగా చేరి పశువులకు వాటికి కట్టిన నగదు పలకలను చేజిక్కిచ్చేందుకు పోటీపడ్డారు. పశువుల పాక నుండి బరిలోకి దించి కోడెగిత్తలు వెనక డప్పులు వాయిస్తూ వాటిని బెదరకొట్టగా అవి బెదిరి దూకుడుగా పరిగెత్తుతుండగా యువకులు పౌరుషంతో పశువులు, కోడిగిత్తల కొమ్ములకు కట్టిన పలకలను చేజిక్కించేదకు పోటీ పడ్డారు. ఈ పోటీలో మూగ జీవాలయిన కోడెగిత్తలు బెదిరి ముందుకు పోగా యువకులు వాటిని పట్టుకునేందుకు ముందుకు వచ్చే క్రమంలో చదురు మదురసంఘటనలో కొంతమంది యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. పరుష పందేలను తిలకించేందుకు విచ్చేసిన జనాలతో కొత్త శానంబట్ల గ్రామం జనసంద్రమైంది. కోడి గిత్తల కొమ్ములకు పశువుల యజమానులు తమ అభిమాన రాజకీయ నాయకుల ఫొటోలు పార్టీ జెండాలతో చెక్క పలకను విశేషంగా అలంకరించి ఊరేగింపుగా తీసుకొచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువత జట్లుగా ఏర్పడి కోడె గిత్తలకు కట్టిన పలకలను చేజిక్కించుకున్న ఆనందంతో ఎగిరి గంతులు వేశారు. మందుబాబుల ఆగడాలు చెప్పనలివి కాలేదు. వారి లోకం వారిదే అన్నట్లు సరదాగా గడిపారు. పరుష పందేలకు విచ్చేసిన జనానికి స్థానికులు అన్న పానీయాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

సమిష్టి కృషితో అభివృద్ధి పనులు

రవికుమార్, జిల్లా పరిషత్ ఎగ్జిక్యూటీవ్ అధికారి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో సమిష్టి కృషితో జిల్లాలోని 66 మండలాలను అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా పరిషత్ ఎగ్జిక్యూటీవ్ అధికారి రవికుమార్ తెలిపారు. ఈమేరకు ప్రభుత్వానికి నిధుల కోసం నివేదికలు పంపామన్నారు. రానున్న వేసవిలో జిల్లా వ్యాప్తంగా ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో జిల్లా పరిషత్ ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

ప్రజాశక్తి: జిల్లా పరిషత్ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలను ఏ మేరకు నిధులు ఖర్చు అంచనా వేస్తున్నారు?

జెడ్పీ సీఈవో: రూ.11 కోట్లు జెడ్పీ నిధులు జిల్లాలో అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేసేలా ప్రణాళిక రూపొందించాం..మండల పరిషత్‌కు రూ.5.54కోట్లు విడుదల చేశామని, రెండు కోట్లు నిధులతో జిల్లా పరిషత్ వనరుల కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

ప్రజాశక్తి: జిల్లా పరిషత్ అతిథి గృహం ఆధునీకరిస్తారా..?

జెడ్పీ సీఈవో: జిల్లా పరిషత్ అతిథిగృహం పురాతన భవనం కావడం ద్వారా పూర్తిగా దెబ్బతింది. ఆ ప్రదేశంలో నూతన భవన నిర్మాణం కోసం రూ.50లక్షలు కేటాయించడంతో పాటు జిల్లా పరిషత్ భవనాన్ని ఆధునీకరిస్తున్నాం. మరుగుదోడ్లు, వాహన పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నాం.

ప్రజాశక్తి: రానున్న వేసవిలో తాగునీటి సమస్యలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జెడ్పీ సీఈవో: ఉమ్మడి జిల్లాలో రానున్న వేసవిలో ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకొనేలా ముందస్తు చర్యలు తీసుకుంటారు. ఈ మేరకు తాగునీటి కోసం రూ.1.5 కోట్లుతో ప్రణాళిక తయారు చేశాం. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలో తాగునీటి సమస్య ఏర్పడే అవకాశాలున్నాయని సమన్వయంతో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

ప్రజాశక్తి: 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయా..?

ఇంటర్వ్యూ

జెడ్పీ సీఈవో: జిల్లాకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.11కోట్లు రెండు విడతల్లో విడుదల చేశారు. ఈ నిధుల్లో 12 శాతం తాగునీరు, 23 శాతం అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేయనున్నాం.

ప్రజాశక్తి : కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లిస్తున్నారు..?

జెడ్పీ సీఈవో: గత ప్రభుత్వంలో పనులు చేసిన కాంట్రాక్టర్లుకు రూ.12 కోట్లు మేర బకాయిలు ఉన్నాయి. ప్రస్తుతం రూ.8కోట్లు వరకు చెల్లించాం. బకాయిల చెల్లింపు విషయంలో ఆందోళన చెందకుండా జిల్లా పరిషత్ చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో చేయాలని కాంట్రాక్టర్లును కోరాం.

ప్రజాశక్తి: జిల్లా పరిషత్ పరిధిలో ఎలాంటి అభివృద్ధి పనులు చేస్తున్నారు..?

జెడ్పీ సీఈవో: ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో జిల్లా పరిషత్ పరిధిలో ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోంది.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ సి జనార్ధన్ రెడ్డి , డాక్టర్ సి రోహిణిల దాతృత్వంతో 20 మంది ఆత్మీయ పేద రెడ్డి బంధువులకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, నూతన వస్త్రాలు లబ్ధిదారులకు ఆదివారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షురాలు డాక్టర్ సి రోహిణి మాట్లాడుతూ డాక్టర్ సిఆర్ రెడ్డి ఆశయాలను కొనసాగించడంలో భాగంగా నాలుగు సంవత్సరాల క్రితం తమ తండ్రి డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసరా పేరుతో నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. దీనిని క్రమం తప్పకుండా ప్రతి నెల ఇవ్వడం ఆనందంగా ఉందని, ఆయనను లబ్ధిదారులు, రెడ్డి సంఘ సభ్యులు తలచుకోవడం ఆనందాన్ని ఇస్తోందన్నారు. అందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి అవకాశం కల్పించిన రెడ్డి సంఘ సభ్యులకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పలువురికి వస్త్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో దేశి రెడ్డి, ప్రజేంద్రారెడ్డి, మండి శ్రీనివాసులు రెడ్డి, దువ్వూరు విజయభాస్కర్ రెడ్డి, కందాటి రాఘవరెడ్డి, ఎర్ర మాకు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, పలమాల హరినాథ్ రెడ్డి, బత్తల శేషారెడ్డి, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్: సీఐ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నేరాలను నియంత్రించేందుకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు గూడూరు రూరల్ సీఐ కిషోర్ బాబు అన్నారు. గూడూరు పట్టణం గాంధీనగర్ టిడ్కో గృహ సముదాయంలో పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేశారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని ఒక కారు, తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ కిషోర్ బాబు స్థానిక ప్రజలకు సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు మనోజ్ కుమార్ , గోపాల్ , తిరుపతయ్య , సురేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

దుప్పట్లు అందజేత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఈ నెల 12వ తేది మన సంస్థ ఐదవ వార్షికోత్సవం సందర్భంగా, జనవరి 1వ తేది నుంచి 12వ తేది వరకు చేపట్టిన ప్రగతి వారోత్సవాలలో భాగంగా గూడూరు బాలాజీ నగర్‌లో ప్రగతి కార్యాలయంలో వర్ధంతి సందర్భంగా 40 మందికి దుప్పట్లు, వెజిటబుల్ బిర్యానీ ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు చంద్రశేఖర్ మాట్లాడుతూ విందూరు గ్రామానికి చెందిన ప్రభాకర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు హాజరై ఈ కార్యక్రమం నిర్వహించారు. పండగ వాతావరణాన్ని తలపిస్తోందన్నారు. అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరీ కాటూరి శ్రీనివాసులు ప్రగతి కుటుంబ సభ్యులు వాకాటి రామ్మోహనరావు, గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, కె ఆర్ ఎం కుమార్ నాయుడు, కోట వెంకటేశ్వర్లు, వై కృష్ణారెడ్డి, డిష్ నాగరాజు, తూపిలి యశ్వంత్, గోల్డ్ షాప్ కృష్ణారెడ్డి, వాకాటి శ్రీనివాసులు ప్రభాకర్ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉప్పల ప్రసాద్ గౌడ్

ప్రజాశక్తి -కోట : మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు కోట మాజీ జెడ్పీటీసీ, కొత్తపట్నం గ్రామ ఉపసర్పంచ్ ఉప్పల ప్రసాద్ గౌడ్‌ను జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా ఉప్పల ప్రసాద్ గౌడ్ జిల్లా స్థాయిలో అందరికీ తెలిసిన వ్యక్తి. కోట మండలం కొత్తపట్నం పంచాయతీ గోవిందపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి. ఆయన మొదట నుండి ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించే దిశలోనే ప్రయాణించడం ఉప్పల ప్రసాద్ కే దక్కింది. ఈ నేపథ్యంలోనే గతంలో జెడ్పిటిసిగా బాధ్యత వహించారు. ప్రస్తుతం కొత్తపట్నం పంచాయతీ ఉపసర్పంచ్‌గా కొనసాగుతున్నారు. ఇటీవల పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు తొలగింపు విషయంలో న్యాయం చేయాలని పోరాటం చేసిన ఘనత అందరికీ తెలిసిందే. ఉప్పల ప్రసాద్ గౌడ్ ఇంజినీరింగ్ (బీటెక్)విద్యాభ్యాసం పూర్తి చేసి ఉన్నతమైన జ్ఞానం కలిగిన వ్యక్తి అని, ఆయన నిరంతరం ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో ముందుంటారని అలాంటి వ్యక్తి ఉప్పల ప్రసాద్ గౌడ్‌కు వైసీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పదవి రావడంతో మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు, వైసీపీ అభిమానులు, బంధువులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మెట్టా రాధాకృష్ణారెడ్డికి సత్కారం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసిపి ఉపాధ్యక్షులుగా ఎన్నికైన మెట్టా రాధాకృష్ణా రెడ్డిని వైసిపి నాయకులు పలువురు తిప్పవరప్పాడులోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించారు. ముఖ్యంగా గూడూరు టౌన్ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, వైసిపీ జిల్లా నాయకులు నాశిన నాగులు, చోళవరం గిరిబాబులు, తిప్పావరప్పాడు గ్రామ సర్పంచ్ దాసరి బేబి రోహిణిలు ఉన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణా రెడ్డి మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో పార్టీ అధిష్టానం చేపట్టే ప్రతి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాను. అలాగే కూటమి వల్లంలో జరుగుతున్న అక్రమాలను ప్రశ్నిస్తూ పార్టీ కంటే నియోజక వర్గంలో అధిక సంఖ్యలో సభ్యత్వాలను నమోదు చేయించి పార్టీ అధిష్టానానికి, జిల్లా నాయకులకు కానుకగా అందిస్తానన్నారు.

మాజీ ఎంపీపీకి ఎమ్మెల్యే నివాళి

ప్రేమావతమ్మ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మాజీ ఎంపీపీ కొళిదల ప్రేమావతమ్మ భౌతిక కాయానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నివాళులర్పించారు. శనివారం రాత్రి ప్రేమావతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రేమావతమ్మ స్వగ్రామమైన పిచ్చాటూరు మండలం వేలూరు గ్రామానికి చేరుకుని భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రేమావతమ్మ ఏపి స్టేట్ సివిల్ సప్లైస్ డైరెక్టర్‌గా, శ్రీకాళహస్తి టెంపుల్ బోర్డు డైరెక్టర్‌గా, పిచ్చాటూరు మండల ఎంపీపీగా పదవులు అలంకరించి, ఆ పదవులకు వన్నె తెచ్చారని కొనియాడారు. ఆమె మృతి, మండలానికి తీరని లోటు అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ప్రేమావతమ్మ భర్త శ్రీరాములునాయుడు, తనయుడు సతీష్ నాయుడులతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత క్లస్టర్ ఇన్‌ఛార్జి, మార్కెట్ చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి, సర్పంచ్ పద్మ రాజు, వాసు రెడ్డి, అరణియార్ ప్రాజెక్టు చైర్మన్ రవి, చిన్న, ఎమ్మన్ రవి, నాగరాజు, రుకేష్ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న జేసిజిటిఏ సభ్యులు

జేసిజిటిఏ అధ్యక్షులుగా నరసింహులు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం (జేసిజిటిఏ) అధ్యక్షులుగా టి నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా తిరుపతి జిల్లా ఏర్పడిన తర్వాత మొదటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంఘ ఎన్నికలు తిరుపతిలో మొట్ట మొదటి సారి నిర్వహించారు. 2025- 27 విద్యా సంవత్సరాలకు వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ ఎన్నికలకు నెల్లూరు జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు ఏ నరసింహులు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ ఎన్నికలో తిరుపతి జిల్లా అధ్యక్షులుగా టి నరసింహులు, కార్యదర్శిగా ఎస్ శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారిగా డాక్టర్ మస్తాన నరసింహులు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కె నరసింహవర్మ, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ కె కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపక సంఘ ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి రాష్ట్ర సంఘ సలహాదారుడు డాక్టర్ తమటం రామచంద్రారెడ్డి, ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వి.రవి, ఇతర అధ్యాపకులు అభినందనలు తెలియజేశారు.

ముగిసిన సమావేశాలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : స్థానిక ఎస్ కెఆర్ డిగ్రీ కళాశాలలో నాలుగు, ఐదవ తేదీల్లో నిర్వహించిన 47వ చరిత్ర సమైఖ్య సమావేశాలు ఘనంగా ముగిశాయి. ఈ సమావేశాల్లో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన చరిత్రకారులు, దాదాపు 206 పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈ ముగింపు కార్యక్రమానికి నాగసూరి వేణుగోపాల్ ప్రముఖ ఆల్ ఇండియా రేడియో వ్యాఖ్యత తన ప్రసంగంలో చరిత్ర ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేశవ ప్రసాద్ మాట్లాడుతూ సమావేశం విజయవంతం కావడానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. స్థానిక కార్యదర్శి డాక్టర్ గోవింద సురేంద్ర ధన్యవాదాలు తెలిపి రాష్ట్ర ఉత్తమ చరిత్ర అధ్యాపకుడిగా 2025 అవార్డు గ్రహీత డాక్టర్ రాజా మహమ్మద్ ను సత్కరించారు. అనంతరం కళాశాల సిబ్బంది గోపాల్ జనార్ధన్, శైలజ, శ్రీధర్, రసూల్ ,కిరణ్మయి పలువురుని సత్కరించారు. ఈ సమావేశం విజయవంతంగా ముగిసినందుకు ప్రిన్సిపాల్ అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

మాట్లాడుతున్న ప్రముఖులు

విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి: ఎమ్మెల్యే

మహాత్మా జ్యోతిబా పూలే చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -దొరవారిసత్రం : ప్రతి విద్యార్థి విద్యతో పాటు, క్రీడారంగంలోనూ ప్రతిభ కనపరచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు పట్టుదలతో ముందుకు సాగాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ సూచించారు. ఆదివారం ఆమె మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలకు నివాళులర్పించి బిసి గురుకులంలో రెండు రోజులు నిర్వహించనున్న జోనల్ స్థాయి క్రీడా పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యతో పాటు, క్రీడలలో పాల్గొని ఉత్సాహవంతులైన యువకులకు మంచి ప్రోత్సాహం ఇస్తోందన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందని గుర్తు చేశారు. వ్యాయామం, క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు, దేహదారుఢ్యానికి దోహద పడుతాయన్నారు. నియోజకవర్గంలోని దొరవారిసత్రం గురుకులానికి మంచి గుర్తింపు, విశాలమైన క్రీడా మైదానం ఉండడంతో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన బిసి గురుకుల విద్యార్థులకు జోనల్ స్థాయి క్రీడలు నిర్వహించడం ఆనంద దాయకమన్నారు. పరుగు పందేలు, కబడ్డీ, వాలీబాల్, కోకో, తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతయ్య, మండల టిడిపి అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి, పార్థసారథి, టిడిపి మండల నాయకులు, మాజీ జెడ్పిటిసి ఇట్లగుంట రత్నయ్య, మాజీ ఎంపీటీసీ ఉదయ్ కుమార్, నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు షబ్బీర్, రాయపాటి రాజేంద్రప్రసాద్, మారంరెడ్డి గోపాల్ రెడ్డి, నాగేంద్ర నాయుడు, యువనాయకుడు విజయ్, ఆదిముని, మల్లేపల్లి సుబ్రహ్మణ్యం, గ్రామ పంచాయతీ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రోడ్లకు భూమి పూజ

రోడ్ల నిర్మాణానికి భూమి చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని తాటిమాకుల కండ్రిగ సమీపంలోని గుండోడుకణం రోడ్డును రూ.3.16 లక్షల రూపాయలతో నిర్మాణం పూర్తి చేస్తామని ఎమ్మెల్యే పులివర్తి వెంకట మణి ప్రసాద్ (నాని) అన్నారు. తాటి మాకుల కండ్రిగ సమీపంలో రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ఆదివారం భూమి పూజను నిర్వహించి పనులు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నానికి మాజీ ఎంపీపీ కేశవుల నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి, కోరా హరిప్రసాద్, అధికారులు, కూటమి నాయకులు ,ఘన స్వాగతం . కొత్త నెన్నూరు నుండి టీటీకండ్రికవరకు 22 అడుగుల వెడల్పుతో రెండు నెలల్లో బీటీ రోడ్డు నిర్మించి ప్రజలకు రవాణా సౌకర్యాలు కల్పిస్తామని ఆయన తెలిపారు. గుండోడు కణం రోడ్డు నిర్మాణానికి రూ 3కోట్ల 16 లక్షలు రూపాయలు ఎన్ఆర్జిఎస్ నిధులను ముఖ్యమంత్రి చంద్రబాబు మంజూరు చేశారని తెలిపారు. గుండోడుకణం రోడ్డు నిర్మాణం పూర్తయితే 30 గ్రామాల ప్రజలు తిరుపతికి వెళ్లడానికి సుమారు 7 కిలోమీటర్ల దూరం తగ్గు తుందని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వం పాలకులు అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా.. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి .. అవినీతి, అక్రమా లకు పాల్పడ్డారని విమర్శిం చారు. సాధారణ ఎన్నికల సమయంలో గుండోడుకణం రోడ్డు సమస్య స్థానిక ప్రజలు తమ దృష్టికి తీసుకు వచ్చారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే రోడ్డు ఏర్పాటు చేస్తానని ఎన్నికలలో ప్రజలకు హామీ ఇచ్చాను. ఇచ్చిన హామీ మేరకు రోడ్డు పనులు ప్రారంభించిన హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే పులివర్తి నానికి మండల ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో చేకూరి జనార్ధన్ చౌదరి, ఎన్ చిన్నబాబు, ఈ ఉమాపతి నాయుడు, నీలకంత చౌదరి, లెక్కల మహేష్ నాయుడు, సురేంద్ర నాయుడు, దినేష్ చౌదరి, తులసీనాయుడు, కే ముద్దు కృష్ణారెడ్డి, కే నరసింహారెడ్డి బండి విజయకుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లు బి ధనంజయలు, ఈ మురళి నాయుడు, సాయి ప్రసాద్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రభాకర్ రెడ్డి, తహశీల్దారు కే వెంకటరమణ, ఎంపీడీవో ఇందిర, పంచాయతీ కార్యదర్శి చిరంజీవి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్ సంస్థ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :
స్థానిక త్యాగరాజా వీధి లోని శ్రీ కళ్యాణవీరభద్ర స్వామి దేవస్థానంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ ఆంధ్రమహిళా మండలి సహకారంతో 37 మంది పేద ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర వస్తువులు పంపిణీచేశారు. ఈ కార్యక్రమానికి దాతలు గా కొండారెడ్డి , సౌజన్య ఐదువేల రూపాయలు అందించారు. ఈ కార్యక్రమానికి రోహిణమ్మ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని కల్గి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి కార్యదర్శి విష్ణువందన ,ఇన్నర్ వీల్ క్లబ్ కార్యదర్శి అనితా సభ్యులు లక్ష్మి ఇంకా రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, ,పల్లం వెంకటేశ్వర్లు, మెదురు శ్రీనివాసఆచారి పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న దాతలు

డాక్టర్ నారాయణ గౌడ్‌కు సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్ :
ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నారాయణ గౌడ్ గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెలికండ్లలో కౌండిన్య ఐఏఎస్ అకాడమీలో ఆదివారం విద్యార్థులను ఉద్దేశించి ఉపన్యాసం చేశారు. ఇందులో భాగంగా అకాడమీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ గౌడ్ ను ఘనంగా సన్మానించారు. డాక్టర్ నారాయణ గౌడ్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా రాష్ట్ర వ్యాప్తంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుపేద విద్యార్థులకు తక్కువ ఫీజులతో కోచింగ్, హాస్టల్ వసతి కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా అకాడమీ చైర్మన్ ఇ.వి. నారాయణ, సత్యనారాయణ కు గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

నారాయణ గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఘనంగా గురుకులం రజతోత్సవ వేడుకలు

ప్రజాశక్తి -వాకాడు: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం లో రజతోత్సవ వేడుకలను పూర్వ విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం వాకాడులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో వారి అనుభవాలను నేటి తరాలకు వివరిస్తూ పూర్వపు విద్యార్థులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చి వారితోపాటు ఎక్కడెక్కడో ఉన్న విశ్రాంతి ఉపాధ్యాయులను సైతం ఆహ్వానించి రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ కన్వీనర్ డేవిడ్ మాట్లాడుతూ1992లో అప్పటి మూల పడవ సర్పంచ్ తిరుపాలయ్య కృషితో అప్పటి ముఖ్యమంత్రి నేదురమల్లి జనార్ధన్ రెడ్డి సహకారంతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను తీసుకొచ్చారని మూల పడవ సుదూర ప్రాంతం అయినందువల్ల అక్కడ సరైన అనుకూలతలు లేక 1992లో చిల్లకూరులో ఏర్పాటు చేసినప్పటికీ అప్పటి నుంచి 2000 సంవత్సరం సెప్టెంబర్ 30 వ వాకాడికి తరలించారన్నారు. వారు అప్పుడు నేర్పిన విద్యా కృషి ఫలితంగా ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ ల రూపంలో ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఇప్పటివరకు 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు 1000 మందితో మమేకమై ఘనంగా రజతోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వపు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇక్కడికి చేరుకుని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఎఎస్ అధికారి అంచిపాక సునీల్, ఐపీఎస్ అధికారి గోపీనాథ్ జెట్టి, ఐఆర్ఎస్ అధికారి యాగాని యోగానంద బాబు ను ఆహ్వానించారు. వీరిలో సునీల్ అనుభవాలను ప్రస్తుత విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా సునీల్ సహాయంతో గురుకుల పాఠశాలకు కావలసిన వసతులు ముఖ్యంగా మంచి నీటి సదుపాయం కోసం ఆర్వో ప్లాంట్ ను, వారికి కావాల్సిన మోటర్లను, కంప్యూటర్ ల్యాబ్ ను సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేశారు. వారు మొదట అంబేద్కర్ విగ్రహావిష్కరణ, రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. చివరగా పూర్వపు విద్యార్థులు వారి ఉపాధ్యాయులను పూలతోసత్కరించి ఆనందింప చేశారు. ఈ కార్యక్రమంలో దండు ప్రసాద్, కొనతం సుబ్రహ్మణ్యం, పూర్వపు విద్యార్థుల నుంచి 25 లక్షల రూపాయలు సమకూర్చి ఘనంగా నిర్వహించినందుకు వారికి ఉపాధ్యాయులు ఆశీర్వాదం తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్య అతిథులు

హథీరాంజీ మఠం ఇన్‌ఛార్జి పాలనాధికారిగా బాపిరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీ స్వామి హథీరాంజీ మఠం ఇన్‌ఛార్జి పాలనాధికారిగా శ్రీకాళహస్తి కార్యనిర్వహణాధికారి డిప్యూటీ కలెక్టర్ టి. బాపిరెడ్డి నియమితులయ్యారు. గతంలో ఇన్‌ఛార్జి పాలనాధికారిగా పనిచేసిన విజయవాడ కనకదుర్గమ్మ గుడి కార్యనిర్వాహణాధికారి కేఎస్ రామారావు ఉద్యోగ విరమణ పొందడంతో, 2024 డిసెంబర్ 31న రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీకాళహస్తి కార్యనిర్వాహణ అధికారిని హథీరాంజీ మఠం ఇన్‌ఛార్జి పరిపాలన అధికారిగా నియమించారు. ఈ మేరకు తిరుపతి గాంధీ రోడ్డులో ఉన్న శ్రీ హథీరాంజీ మఠంలో డిప్యూటీ కలెక్టర్ బాపిరెడ్డి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఈఓ శ్రీనివాసులురెడ్డి, పర్యవేక్షణ అధికారి కేశవులు, లా ఆఫీసర్ కవిత, మఠం సిబ్బంది ఇన్‌ఛార్జి పాలనాధికారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఎల్లమ్మ ఉత్సవాల నిర్వహణపై ఎమ్మెల్యే సమీక్ష

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మూలస్థానం ఎల్లమ్మ సంక్రాంతి ఉత్సవాల నిర్వహణపై స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ, స్థానిక ప్రజలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మొదట ఆలయం వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే పులివర్తి నానికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు నిర్వహించనున్న సంక్రాంతి ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి, అందరి సహకారంతో విజయవంతంగా అమ్మవారి కొండ చుట్టూ ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. సంక్రాంతి ఉత్సవాలకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయ ప్రాంగణంతో పాటు అన్ని ప్రధాన వీధులలో విద్యుత్ దీపాలు, పచ్చని తోరణాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించాలన్నారు. చంద్రగిరి గ్రామపంచాయతీ అధికారులు అమ్మవారి ఆలయ పరిసరాలతో పాటు పట్టణమంతా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు.. ఉత్సవాల సందర్భంగా చంద్రగిరి పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు ఏర్పాటు చేసి, వాహనాలను బైపాస్ రోడ్డుపై వెళ్లేటట్లు చర్యలు తీసుకోవాలని సిఐ సుబ్బరామిరెడ్డికి సూచించారు. వాలంటీర్లను ఏర్పాటు చేసి ఆలయం వద్ద క్యూలైన్లను క్రమ బద్ధీకరిం చాలని తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యుత్ శాఖ విద్యుత్ సరఫరాకు అంత రాయం కలగకుండా చూడాలని కోరారు. ఏదైనా తప్పని పరి స్థితులలో విద్యుత్ అంత రాయం ఏర్పడితే, ప్రత్యామ్నాయంగా జనరేటర్లను సిద్ధం చేసుకోవాలన్నారు. అమ్మవారి కొండ చుట్టూ ఉత్సవం సందర్భంగా పోలీస్ శాఖ గట్టిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అమ్మవారి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉందని అందరికీ విజ్ఞప్తి చేశారు. అమ్మవారి వాహనాన్ని మోసే వాహన బేరర్లకి ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని యూనిఫామ్ దుస్తులను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు ఆలయ కమిటీ ఛైర్మన్, సభ్యులు, ప్రముఖులు, కూటమి నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

విద్యార్థులకు పట్టాలు అందిస్తున్న ముఖ్య అతిథులు

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థిని విద్యార్థులు నూతన ఆలోచన లతో ముందుకు వెళితే విజ యం సాధిస్తారని న్యాక్ ఛైర్మన్ అనిల్ సహస్ర బుద్ధ పేర్కొన్నా రు. గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గూడూరు పట్టణంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో 8 వ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాక్ చైర్మన్ అనిల్ సహస్ర బుద్ధ , అనంతపూరు జెఎన్‌టియు రిజిస్ట్రార్ కృష్ణయ్య హాజరయ్యారు. ముఖ్య అతిథులకు కళాశాల ఛైర్మన్ వంకి పెంచలయ్య , అరవింద ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థిని విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ సర్టిఫికెట్లు అందించారు. న్యాక్ ఛైర్మన్ అనిల్ సహస్ర బుద్ధ మాట్లాడుతూ ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుండి విద్యార్థిని విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారని ఆదిశంకర కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు సమకూర్చడం అభినందనీయమన్నారు. డిగ్రీ పట్టాలు పొందిన వారు నేటి పోటీ ప్రపంచంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని వినూత్న ఆలోచనలతో ముందుకు వెళితే విజయం సాధిస్తారని సూచించారు. జేఎన్టీయూ యూనివర్సిటీ రిజిస్ట్రారు కృష్ణయ్య మాట్లాడుతూ డిగ్రీ అయిపోయింది.. మనకేమిలే అనుకోకుండా ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాని కోసం కష్టపడాలని నేడు ప్రతి రంగంలో విపరీతమైన పోటీ ఉందని వాటిని అధిగమించేందుకు కష్టపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్, మోహన్ ఏవో, రామయ్య హెచ్‌వోడీలు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ చేస్తున్న శ్రీ జగద్గురు సేవా సమితి సభ్యులు

అంధులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: శ్రీ జగద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో అంధులకు పండ్లు, బిస్కట్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ చీఫ్ మేనేజరు ఉదయ్ భానురెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఈ సేవా సమితి అకౌంట్ పంజాబ్ నేషనల్ బ్యాంకులో ప్రారంభించారు. ఈ సేవాసమితి ముఖ్య ఉద్దేశ్యం అంధులకు, బధిరులకు సేవ చేయడమే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ ముఖ్య కార్యదర్శి ధన్యంతకుమార్ మాట్లాడుతూ ఈ సమితి పురాతన దేవాలయాలకు మరమ్మతులు చేయడం, రంగులు వేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఇందులో భాగంగానే ప్రభుత్వ అంధుల హాస్టల్‌లో పండ్లు, బిస్కట్లు పంపిణీ చేయడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు మోహన్ రామిరెడ్డి మాట్లాడుతూ కొందరు ఉద్యోగుల, దాతలు స్వచ్ఛందంగా సేవ చేయడానికి ఈ సమితిని ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు విశ్వనాథ్, చంద్రశేఖర్ గోవిందరెడ్డి, సందీప్ రెడ్డి, దామోదర్ రెడ్డి పార్వతి, నిర్మల, హీరా, అంధులు పాఠశాల సభ్యులు పాల్గొన్నారు.

మన సంస్కృతికి చిహ్నాలు రంగవల్లులు: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : మన తెలుగు సంస్కృతి సంప్రదాయాలను నేటి తరానికి తెలిపే విధంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం స్ఫూర్తి దాయకంగా నిలుస్తుందని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు . గూడూరు రెండో పట్టణ పరిధిలోని సిరామిక్ కళాశాలలో సిరామిక్ యూత్ అండ్ సిరామిక్ యూత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సిరామిక్ యూత్ నిర్వహించిన ముగ్గుల పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల రంగవల్లికలు తీర్చిదిద్దారు. విజేతలకు బహుమతులు అందించేందుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళలు వేసిన రంగవల్లులను తిలకించారు. అనంతరం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్రాంతి పండుగలో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేసి ప్రోత్సహించడం అభినందనీయమని తెలిపారు. ఈ ముగ్గుల పోటీల ద్వారా గూడూరు పట్టణంలో ముందుగానే సంక్రాంతి శోభ సంతరించుకుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రోహిణి, సీనియర్ ఆడిటర్ రామ్మోహన్ రావు, పులిమి శ్రీనివాసులు, మీరా రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

శ్రీచక్రలో అరుదైన శస్త్ర చికిత్స

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: శ్రీ చక్ర ఆసుపత్రిలో 75 సంవత్సరాల వృద్ధురాలికి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ రాజేష్ తెలిపారు. స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని ఆ ఆసుపత్రి వద్ద ఆదివారం అయన విలేకరులతో మాట్లాడుతూ 75 సంవత్సరాల వయసు గల సుబ్బలక్ష్మి అనే వృద్ధురాలు గత కొంతకాలంగా మోకాళ్ల నొప్పులతో, నడవలేని స్థితిలో ఆసుపత్రికి వచ్చారన్నారు. వైద్యులు ఆమెను పరిశీలించి, ఆమెకు జెయింట్ పెర్ ట్యూమర్ స్టల్ ఫేమర్ ఉన్నట్లు నిర్ధారించారు. ఆమెకు అత్యాధునిక పద్ధతిలో మెగా ప్రాసెస్ ఉపయోగించి, మోకాల మార్పిడిని విజయవంతంగా నిర్వహించామన్నారు. ఇలాంటి అత్యంత క్లిష్టమైన ఆపరేషన్లు ఇప్పటివరకు మహానగరాలైన చెన్నై బెంగళూరు హైదరాబాద్ వంటి వాటిలోని నిర్వహించే వారిని, ఇప్పుడు తిరుపతి శ్రీ చక్ర ఆసుపత్రిలో కూడా ఇలాంటివి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. కెనడా, సింగపూర్ ప్రాంతాల్లో ప్రత్యేక శిక్షణ తీసుకున్న డాక్టర్ రాజేష్ అతి తక్కువ ఖర్చుతో క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నారని వెల్లడించారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మంత్రిని కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేష్‌ను ఉండవల్లి నివాసంలో నగరి నియోజకవర్గ టిడిపి మైనారిటీ తెలుగు యువత ఆర్గనైజర్ సెక్రెటరీ ఎస్ హమీద్ బాష ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నగరి నియోజకవర్గ ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ సహకారంతో మైనారిటీలకు సంక్షేమ పథకాలు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు.

తెలుగు కీర్తికి అవిరళ కృషి: టిడిపి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: తెలుగుజాతి అభ్యున్నతికి, తెలుగు నేల అభివృద్ధికి, తెలుగు భాష కీర్తికి టీడీపీ చిత్తశుద్ధితో అవిరళ కృషి చేస్తోందని ఆ పార్టీ తెలుగుదేశం బిసి విభాగం నాయకులు మీడియాకు తెలిపారు . ప్రజలకు అర్థమయ్యేలా ఇకపై తెలుగులోనూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించడం ఇందుకు నిదర్శనం అన్నారు. ఈ నిర్ణయం పట్ల తెలుగుజాతి యావత్తూ సంతోషం వ్యక్తం చేస్తోందని తెలిపారు. మిన్నల్ రవి, డా.యం.ఉమేష్ రావు, నెమళ్లూరు బుజ్జి, కోటా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.